క్లుప్తంగా

41 రోజులు అన్నదానం



గుండ్లాపల్లి శివాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి అయ్యప్ప స్వాముల భక్త బృందం గురుస్వాములు యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, అద్దాల రవి బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించినట్లు గురు స్వాములు గురువారం తెలిపారు. 41 రోజులపాటు అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండ్లాపల్లి గ్రామంలోని శ్రీ గంగాబాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. అయ్యప్పస్వామి భక్తులు శివస్వామి భక్తులు, వెంకటేశ్వరస్వామి మాలధారులు భవాని మాలధారులందరికీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామని తెలిపారు

వసతి గృహాల పరిశీలన



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: స్థానిక ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను ఎంపీడీఓ వి. జ్యోతి గురువారం పరిశీలించారు. విద్యార్థులకున్న సౌకర్యాలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. బీసీ బాలుర వసతి గృహం పాతది కావడంతో అక్కడక్కడా పెచ్చులు ఊడుతున్నాయని విద్యార్థులు ఎంపీడీఓకు తెలిపారు. అనంతరం భోజనం ఎలా పెడుతున్నారన్న అంశాలను గమనించారు. బీసీ బాలుర వసతి గృహంలో ఆరు బయట చదువుకోవడానికి షెడ్ వేయించాల్సిన ఆవశ్యకత గుర్తించారు. వసతి గృహ నిర్వాహకులు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



నిడమానూరులో పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

నాగులుప్పలపాడు: గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు నిడమానూరు గ్రామ సర్పంచ్ వడ్డిముక్కల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించిన సర్పంచ్ గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, మురుగు కాల్వల శుభ్రత గురించి కార్మికులకు సూచనలు చేశారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు ఉండాలి



అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ పాఠశాలలో టిఫిన్ చేస్తున్న ఎంపీడీఓ

నాగులుప్పలపాడు: వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు, భోజనం మెనూకు తగ్గకుండా ఉండాలని ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని అమ్మనబ్రోలు బాలుర వసతి గృహం, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పాటు పోతవరం బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో మరుగుదొడ్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతనం విద్యార్థులకు అందించే అల్పాహారం వివరాలు అడిగి తెలుసుకొని అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాల నిర్వహణలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని అందరూ తప్పకుండా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని తెలిపారు.

సంతనూతలపాడు: స్థానిక బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ సురేష్ బాబు పలువురు సిబ్బందితో వెళ్లి హాస్టళ్ల పరిశీలించారు. సంతనూతలపాడులోని ఏపీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎన్. ప్రతాప్ కుమార్, ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సంతనూతలపాడు: ఏపీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సురేష్ బాబు

జలం.. జ్వరం.. దుర్గంధం



కొత్తపట్నం బీసీ హాస్టల్ పక్కన ఉన్న ఎస్టీ కాలనీలో గృహాలు



మోటుమాల పొలిమేర ఆర్అండ్‌బీ రోడ్డులో వర్షపు నీరు

- జనావాసాల మధ్యే వర్షపు నీరు
- దోమల ఉత్పత్తితో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- విషజ్వరాలతో హాస్పిటల్ పాలవుతున్న జనం
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

కొత్తపట్నం:

తుఫాన్ ప్రభావం తగ్గి ఐదు రోజులు గడుస్తున్నా ఇళ్ల ముందు వర్షం నీరు అలాగే నిలబడి ఉంది. దీంతో విష సర్పాలు, ఇతర కీటకాలు నివాసాల్లోకి చొరబడుతున్నాయి. ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో పాటు పురుగుపుట్రా దెబ్బకు జనం నిద్రపోవాలంటే భయాందోళనలు చెందుతున్నారు. కంటిమీద కునుక లేకుండా బిక్కు, బిక్కు మంటు కాలం గడుపుతున్నారు. తుఫాన్ సమయంలో వారిని పునరావస కేంద్రాలకు తరలించినప్పటికీ ఇళ్లలోనే ఉన్న నీరు బయటకు పంపే పరిస్థితి లేకుండా పోయింది. తహసీల్దార్ మధుసూధన్‌రావు పొక్లెన్‌లతో రెండు కిలో మీటర్ల మేర కాలువ తీయించినా.. సగం నీరు అలాగే నిలిబడి పోయింది. ఎక్కడకు పోవాలో తెలియక ఆ నీటి మధ్యే జీవిస్తున్నారు. ముఖ్యంగా కొత్తపట్నం గ్రామంలో గంగమ్మ గుడి ఆవరణ పక్కన పాములవాళ్లు, బండోళ్లు, వివిధ రకాల కులస్తులు నివాసం ఉంటారు. అలాగే బీసీ హాస్టల్ పక్కనే.. ఎస్టీలు నివాసం ఉంటున్నారు. కాగా ఈప్రాంతాలన్నీ వర్షానికి పూర్తిగా మునిగిపోయాయి. వర్షం పడిన దగ్గర నుంచి ఆ ఇళ్లలో ఉండటంలేదు. కొంత మందే తిరిగి వెళ్లారు.



కె.పల్లెపాలెం గ్రామంలో ఇళ్ల ముందు

రహదారుల్లో వర్షపు నీరు

ఇది ఇలా ఉంటే రహదారుల్లో కూడా వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన ప్రబలతోంది. రోడ్డున వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అయ్యి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వారాలు వచ్చి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రధానంగా కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ దగ్గరలో రాజుగోపాల స్వామి ఆలయం ముందు వర్షపు నీరు చేరి నెల రోజుల నుంచి ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఆలయంలోకి భక్తులు పోవాలంటే బట్టలు తడిచి పోయే పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఆలయానికి రావడం మానుకున్నారు. బీసీ కాలనీలో ఇళ్ల ముందు నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రంగాయపాలెంలో ప్రధానం రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలగటమే కాకుండా దుర్వాసన దెబ్బకు ప్రజలు ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది.

కె.పల్లెపాపలెం హెల్త్ క్లీనిక్ సెంటర్ దగ్గరలో వర్షపు నీరు చేరి దుర్వాసన వస్తోంది. నీటిని కొంత బయటకు పంపించినప్పటికీ దుర్గంధం వదిలి పోలేదు. ఇలాంటి వాతావరణంలో రోగాల మధ్య జనం విలవిల్లాడుతున్నా.. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనంగా మారింది.



రాజుగోపాలస్వామి ఆలయం ముందు ఉన్న వర్షపు నీరు

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



పెదకొత్తపల్లిలో మాట్లాడుతున్న డీపీఎంఓ వర ప్రసాద్

మద్దిపాడు: వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీపీఎంఓ వర ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని పెదకొత్తపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక డాక్టర్ ఆనందమోహన్ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కుష్ఠు వ్యాధి ఎలా గుర్తించాలి, వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి? అన్న అంశాలను వివరించారు. అటువంటి లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే ఆశ వర్కర్లకు తెలియజేయాలని కోరారు. ఆసుపత్రి డాక్టర్ ఆనందమోహన్ మాట్లాడుతూ విద్యార్థులంతా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. కాచి వడపోసిన నీరు తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. సూపర్‌వైజర్ బాలకోటయ్య, వైద్యశాఖ సిబ్బంది వనజాక్షి, పూజిత, సురేష్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఉత్పత్తులు పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

చీమకుర్తి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ అన్నారు. గురువారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను పీడీతో పాటు కమిషనర్ వై.రామకృష్ణయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలను పెంచేందుకు బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తుందన్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మెప్మా బజార్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా బజార్‌లో వస్త్ర, కథ, ఆభరణ్, ఆహా కేటగిరీలలో ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం కమిషనర్ వై.రామకృష్ణయ్య ఫినాయిల్‌ను కొనుగోలు చేసి మెప్మా మహిళల ఉత్పత్తులకు ప్రోత్సాహంగా నిలిచారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది రఘు, విజయకుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- ఇద్దరు పిల్లలతో కలిసి రోడ్డుపై నిరసనకు దిగిన వివాహిత



ఇద్దరు పిల్లలతో నడిరోడ్డుపై నిరసనకు దిగిన వివాహిత

ఒంగోలు టౌన్: మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న తన భర్త నవీన్ తనతో పాటు పిల్లలను పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని కోరుతూ జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన హర్షవర్థిని గురువారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై నిరసనకు దిగింది. న్యాయం చేయమని అడిగితే భర్త, మామ కలిసి కొడుతున్నారని, చిత్ర హింసలకు గురిచేస్తున్నారని వాపోయింది. గత కొద్ది రోజులుగా పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేకనే రోడ్డుపై నిరసనకు దిగాల్సి వచ్చిందని తెలిపింది. ఇప్పటికే పలుమార్లు ఎస్పీ ఏఆర్ దామోదర్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్యలను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విడిది షెడ్డు తొలగింపుపై వాగ్వాదం



ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రిస్టియన్ కాలనీ వాసులు

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు క్రిస్టియన్ పాలెం సమీపంలో ఎస్టీల విడిది గృహానికి సంబంధించి షెడ్ తొలగింపుపై గురువారం స్థానిక క్రిస్టియను పాలెం వాసులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. క్రిస్టియన్ పాలేనికి చెందినవారు వివాహాల నిమిత్తం ఎన్నో ఏళ్లుగా ఉపయోగించుకుంటున్నామని వారు పేర్కొన్నారు. దీనికి సంబంధించి అగ్రకులాలు, ఎస్టీల మధ్య గొడవలు ఉన్న క్రమంలో మళ్లీ రగడ నెలకొంది. ఓ వివాహ నిమిత్తం టెంట్లు వేయగా వాటిని పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు తొలగించారని ఎస్టీ వర్గీయులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని ఏ. ముత్తయ్య, టి. యోహాన్, రాజారావు, నాగేశ్వరరావు, ప్రభాకర్, సురేషు సాంబయ్యలు అధికారులను కోరారు.

హైకోర్టు రిటైర్డ్ జడ్జి రేపు ఒంగోలు రాక

ఒంగోలు: ఈనెల 26న హైకోర్టు రిటైర్డ్ జడ్జి కేజీ శంకర్ ఒంగోలుకు విచ్చేస్తున్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో తొలిసారిగా 2019-24 బ్యాచ్ అయిదు సంవత్సరాల విద్యార్థులు, 2021-24 బ్యాచ్ మూడు సంవత్సరాల విద్యార్థులు నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరై లా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమం స్థానిక పెళ్లూరు వద్ద ఉన్న ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుందని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నటరాజ్ కుమార్ తెలిపారు.

అనంత కోదండ రామునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సీతా సమేత అనంత కోదండరామ స్వామి

ఒంగోలు మెట్రో: శ్రీరామచంద్రుని జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా నగరంలోని కౌసల్యానందుని శ్రీరామచంద్రులకు అభిషేకాలు అర్చనలు వైభవంగా నిర్వహించారు. స్థానిక పీవీఆర్ గర్ల్స్ హైస్కూల్ గడియారం వారి వీధిలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంత కోదండ రామస్వామికి, మంగమూరు రోడ్డు ఐశ్వర్య నగర్‌లోని సీతా సమేత శ్రీరామచంద్రులకి పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను స్వీకరించి శ్రీరామచంద్రుల వారి ఆశీస్సులు అందుకున్నారు.

28న మెగా జాబ్ మేళా

సంతనూతలపాడు: స్థానిక ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో ఈనెల 28వ తేదీన మూడు కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె. రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ.. జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎయిర్ టెల్ ఎక్స్‌ట్రీమ్ ఫైబర్ రిలయన్స్, ట్రెండ్స్, బ్రహ్మ సాయి ఎడ్యుకేషన్ సొసైటీ కంపెనీలు పాల్గొననున్నట్లు జిల్లా అధికారి వెల్లడించారు. జిల్లాలో 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య గల యువతీ,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ షేక్ బాషా, 9963005209 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అర్చక పరీక్షలకు ఈనెల 31 వరకు గడువు

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశ, వర, ప్రవర్త వారికి అర్చక పరీక్షకు దరఖాస్తులకు ఈనెల 31 వరకు గడువు పొడిగిస్తు ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. నలబై సంవత్సరాలు దాటిన వారు మౌఖిక పరీక్షకు హాజరు కావచ్చు. వీరికి రాత పరీక్షకు మినహాయింపు ఇచ్చారు. ఈనెల 21వ తేదీన ఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురమళ రాంబాబు ప్రధాన కార్యదర్శి స్వర్ణ సురేష్ , కోశాధికారి బడ్డి పూడి ఉమా శంకర్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.



మేరుగు వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, నాయకులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: ప్రజలు దుర్మార్గపు పాలనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని రాష్ట్ర మాజీ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. మండలంలోని దొడ్డవరం ఎంపీటీసీ మేరుగు పద్మ మామ మేరుగు వెంకటేశ్వర్లు పెద్ద కర్మ కార్యక్రమానికి హాజరై.. వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన సాక్షితో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. నాలుగు నెలల పరిపాలనలో 70 మందికి పైగా మహిళలు హత్యాచారాలకు గురైతే.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించరా అని ప్రశ్నించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని మరోమారు చంద్రబాబును తొక్కి పడేస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఎటువంటి పథకాలు వర్తింపజేయలేదని, విద్యార్థులు ఫీజులు చెల్లించడానికి అల్లల్లాడిపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మండవ అప్పారావు, సంతనూతలపాడు పార్టీ అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, గుడ్డపాతల రవి, నారా సుబ్బారెడ్డి బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి, నల్లూరి పవన్ కుమార్, రజని, రావి రవి, జయమ్మ మస్తానమ్మ, తదితర పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్‌బాబు

ఈతముక్కల (కొత్తపట్నం): పోలీసుల సేవలు అంతా గుర్తు పెట్టుకోవాలని కొత్తపట్నం ఎస్సై వేమూరి సుధాకర్‌బాబు అన్నారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఈతముక్కల హైస్కూల్లో విద్యార్థులకు పోలీసుల సేవలు గురించి వివరించారు. ముందుగా ఈతముక్కల హైస్కూల్‌లో చదువుకుని.. అకాల మరణం చెందిన కానిస్టేబుల్ పి.సుబ్బారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఎస్సై మాట్లాడుతూ పోలీస్ సేవలు ఎంతో కష్టంతో కూడినవన్నారు. వారి విధులు, చట్టాల గురించి వివరించారు. చిన్న వయస్సు నుంచి ఎలా రక్షణ పొందాలి, నిత్య జీవితంలో ఎటువంటి పోలీస్ సేవలు వినియోగించుకోవాలని వివరించారు. అనంతరం పోలీస్ అమర వీరుల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య, ఉపాధ్యాయులు నగేష్, హెడ్ కానిస్టేబుల్ పాండురంగారావు, మహిళా పోలీస్ చెన్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షునికి సత్కారం



రవిచంద్రన్‌ను సత్కరిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

సంతనూతలపాడు: పలు సేవా కార్యక్రమాలు నిమిత్తం ఒంగోలు విచ్చేసిన వాసవి కబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్‌ను గురువారం సంతనూతలపాడు వాసవి క్లబ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు ఆధ్వర్యంలో సంతనూతలపాడు వాసవి క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, సెక్రెటరీ చలువాది రాము, తదితరులు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ను కలసి సత్కరించిన వారిలో ఉన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి శిద్దా సూర్య ప్రకాష్ రావు, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు, కె. హరి ప్రసాద్, బ్రహ్మానందం, గవర్నర్ పి. సత్యనారాయణ, రీజనల్ చైర్మన్లు రంగస్వామి, జి.రంగనాథ్, ఏ. సత్యనారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు 12 అర్జీలు



మాట్లాడుతున్న సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: మండల పరిధిలోని ఎనికపాడు గ్రామంలో గురువారం జరిగిన రీ సర్వే.. ఇతర భూ సమస్యలపై పరిష్కారం కోసం జరిగిన గ్రామసభలో 12 అర్జీలు స్వీకరించినట్లు సంతనూతలపాడు తహసీల్దారు వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రీ సర్వేలో తప్పులు జరిగితే అర్జీలు దాఖలు చేసుకోవచ్చని.. వాటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. భూములు విస్తీర్ణంలో వ్యత్యాసం, ఎల్పీఎం సబ్ డివిజన్.. కొత్త పాస్ పుస్తకాల కోసం ఈ అర్జీలు దాఖలయ్యాయి. కార్యక్రమానికి ఎనికపాడు గ్రామ సర్పంచ్ తలారి వెంకట్రావు అధ్యక్షత వహించగా డిప్యూటీ తహసీల్దారు ఎస్. మాబు సుభాని, ఆర్ఐ రామ్ తేజ, ఇన్‌చార్జి మండల సర్వేయర్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి వి. ధనలక్ష్మి, వీఆర్వో యం. మరియకుమార్, సర్వేయర్ సాయికుమారి తదితర సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ ఎల్. నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

అతిసారం ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

ఒంగోలు టౌన్: అతిసారం నివారణలో భాగంగా నేటి నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని డీఎంహెచ్ఓ కె. సురేష్ కుమార్ ఆదేశించారు. గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. తాగునీరు కలుషితమవడం వలన అతిసారం, టైఫాయిడ్, పచ్చ కామెర్లు ప్రబలుతున్నాయని చెప్పారు. నీటి ట్యాంకులు, మినరల్ వాటర్ ప్లాంటులు, బావులను క్లోరినేషన్ చేసి రిపోర్టులను పంపించాలన్నారు. వైద్యులు, సిబ్బంది గృహాలను సందర్శించి బాధితులకు ఇంటివద్దనే వైద్య సేవలను అందించాలన్నారు. వ్యాధి నివారణకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.